క్లుప్తంగా

శిలాఫలకాల ధ్వంసం



చల్లపల్లి: వైఎస్సార్ సీపీకి చెందిన నడకుదురు సర్పంచ్ గొరిపర్తి సురేష్ శిలాఫలకాలను గుర్తుతెలియని ఆగంతకులు బుధవారం ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళితే పులిగడ్డ–విజయవాడ కరకట్టపై నడకుదురు, రాముడుపాలెం గ్రామాల వద్ద రెండు బస్ షెల్టర్లను నాడు నిర్మించారు. ఈ పనుల పర్యవేక్షణ అన్ని అంశాలను సర్పంచ్‌గా తానే దగ్గరుండి పూర్తి చేయించినట్లు సురేష్ చెబుతున్నారు. ఈ పనుల శిలాఫలకాలను ఆయన పేరుతో వేయించారు. వాటిని బుధవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి రెండు చోట్ల శిలాఫలకాలను ధ్వంసం చేశారు. ఘటనకు కారకులపై చర్యలు తీసుకోవాలని సురేష్ కోరుతున్నారు.

ఘనంగా మన్యం పాశుపత హోమం



పెడన: పట్టణంలో తోటమూల సెంటరులోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం గురువారం మన్యం పాశుపత హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మచిలీపట్నానికి చెందిన జొన్నల వరప్రసాద్, వెంకటదుర్గా దంపతులు లోకకల్యాణార్థం ఈ హోమాన్ని ఆలయ పూజారి నాగరాజు ఆధ్వర్యంలో క్రతువును నిర్వహించారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో దాతల సహకారంతో భారీ అన్న సమారాధన జరిగింది.

సంప్రదాయ వస్త్రధారణ పోటీలు



మచిలీపట్నంటౌన్: స్థానిక పోర్టు రోడ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి విచ్చేసిన విద్యార్థులకు గురువారం సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. యోగాసనాలు చేసి, క్యారమ్స్ ఆట ఆడారు. స్పోకెన్ ఇంగ్లిషు నేర్చుకున్నారు. కార్యక్రమాలను జిల్లా ఉపగ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

ఈ పోస్ యంత్రాలు, కాటాలు సక్రమంగా ఉండాలి

పెడన: డీలర్లు జూన్ ఒకటో తేదీ నుంచి దుకాణాల్లో రేషన్ పంపిణీ చేయాల్సిన నేపథ్యంలో కాటాలు, ఈ పోస్ యంత్రాల పనితీరుపై పూర్తి అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పట్టణంతో పాటు మండలంలోని రేషన్ డీలర్లు తమకు అందజేసిన ఈ పోస్ యంత్రాలు, కాటాలను సరిచేయించుకోవడానికి తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. వీరికి లీగల్ మెట్రాలజీ టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు ఈ పోస్ యంత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు కాటాలను పరిశీలించి అప్పగించారు. వీరితో పాటు ఇన్చార్జి ఆర్ఐ విజయలక్ష్మి, డీలర్లు పాల్గొన్నారు.

హర్షిణి సంరక్షణకు బాధ్యత వహించాలి



చిలకలపూడి(మచిలీపట్నం): హర్షిణి పోషణ, సంరక్షణకు బాధ్యత వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో గురువారం చిన్నారి దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న వరంగల్ జిల్లాకు చెందిన రాంబాబు, సబిత దంపతులకు హర్షిణిని డీఆర్వో అప్పగించారు. ఆయన మాట్లాడుతూ దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న దంపతులకు కేంద్ర ప్రభుత్వ దత్తత అధీకృత సంస్థ (కారా) అనుమతిచ్చిన్నారిని దత్తత ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, శిశు గృహ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడిపై పోక్సో కేసు

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో ఓ బాలికతో 85 ఏళ్ల వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదుపై ఇనగుదురుపేట పోలీసులు ఆ వృద్ధుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నంకు చెందిన దేవేంద్రరావు అలియాస్ నటరాజ్ పీఈటీగా పని చేసి ఉద్యోగ విరమణ పొందాడు. జవ్వారుపేటకు చెందిన వ్యక్తితో ఉన్న పరిచయం మేరకు వాళ్ల ఇంటికి వెళ్తూ ఉండేవాడు. సుమారు పది రోజుల క్రితం నటరాజ్.. పరిచయస్తుడి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవటంతో అతని కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక అతని నుంచి తప్పించుకుని బయటికి వెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. విషయం తెలుసుకున్న వారు ఇనగుదురుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా దేవేంద్రరావుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ పరమేశ్వరరావు తెలిపారు.

‘ఆక్సిజన్’పై శ్రద్ధ ఏదీ!

- చల్లపల్లి సీహెచ్‌సీలో నిరుపయోగంగా ఆక్సిజన్ ట్యాంకర్
- పురిటిగడ్డ పీహెచ్‌సీలో పనిచేయని ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్



చల్లపల్లి సీహెచ్‌సీలో ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఆక్సిజన్ ట్యాంకు



పురిటిగడ్డ పీహెచ్‌సీలో పనిచేయకపోవటంతో మూలకు చేరిన ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్

చల్లపల్లి: అసలే కరోనా భయం మళ్లీ వెంటాడుతోంది. ఇలాంటి పరిస్థితిలో చల్లపల్లి సీహెచ్‌సీలో ఆక్సిజన్ ట్యాంకర్ నిరుపయోగం ఉంది. పురిటిగడ్డ పీహెచ్‌సీలో ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ పని చేయడం లేదు. చల్లపల్లిలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) ఉంది. ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర సమయాల్లో, అత్యవసర విభాగాల్లో ఉన్న రోగులకు ఆక్సిజన్ సరఫరా చేసేందుకు ఆక్సిజన్ ట్యాంకుతోపాటు దానికి అనుసంధానంగా పైపులైను ఏర్పాటుచేశారు. దానిలో ఆక్సిజన్ నింపకపోవటంతో అది కాస్తా నిరుపయోగంగా మారింది. దీంతో ఆక్సిజన్ సిలిండర్లను పైపులైనుకు తగిలించి ఆస్పత్రిలోని అత్యవసర విభాగాల్లోకి సరఫరా చేస్తున్నారు. చల్లపల్లితోపాటు ఘంటసాల, మోపిదేవి మండలాలకు చెందిన సుమారు 50 గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. అంతటి ప్రాధాన్యమున్న చల్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో ఆక్సిజన్ నిల్వలు అందుబాటులో ఉండాల్సి ఉంది. ఇలా చేయాలంటే త్వరితగతిన ఆక్సిజన్ ట్యాంకర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పురిటిగడ్డలో..

మండల పరిధిలోని పురిటిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న ఒక్క ఆక్సిజన్ సిలిండర్‌కు తోడు ముందు చూపుతో మరో రెండు ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం ఆక్సిజన్ సిలిండర్ ఖాళీ కావడంతో దాన్ని పక్కనబెట్టేశారు. ఉన్న రెండు కాన్సన్ట్రేటర్లలో ఒకటి నిరుపయోగంగా మారి మూలకు చేరింది. ప్రస్తుతానికి పీహెచ్‌సి మొత్తానికి ఒక్క ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ మాత్రమే అందుబాటులో ఉంది. ఒకేసారి ఇద్దరు రోగులకు ఆక్సిజన్ పెట్టాల్సి వచ్చినప్పుడు పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకమే. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే 108లో రోగులను చల్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తామని అక్కడి సిబ్బంది చెప్పడం కొసమెరుపు. చల్లపల్లిలో ఉండే 108 వాహనం ఫోన్‌కాల్ అందుకున్నప్పటి నుంచి పురిటిగడ్డ పీహెచ్‌సీకి చేరే వరకూ కనీసం 15 నుంచి 20 నిమిషాలు పడుతుంది. ప్రస్తుతం చల్లపల్లి 108 వాహనాన్ని మరమ్మతుల కారణంగా కొన్ని రోజులుగా పక్కనబెట్టేశారు.



పురిటిగడ్డ పీహెచ్‌సీలో ఖాళీగా ఆక్సిజన్ సిలిండర్

ఈ సమయంలో పురిటిగడ్డ పీహెచ్‌సీకి 108 వాహనం రావాలంటే 15 కిలోమీటర్ల దూరంలో ఉండే ఘంటసాల నుంచి గానీ, లేక 10 కిలోమీటర్ల దూరంలో ఉండే మోపిదేవి నుంచి గానీ రావాల్సి ఉంది. ఇవి రావడానికి ఎంతలేదన్నా అర్ధగంటకు పైగా సమయం పడుతుంది. అప్పటి వరకూ రోగి పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఆక్సిజన్‌పై దృష్టి పెట్టాల్సి ఉంది.

త్వరలో బాగు చేయిస్తాం

ప్రస్తుతం ఇక్కడి అవసరాల మేరకు పీహెచ్‌సీలో ఉన్న ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ సరిపోతుంది. అత్యవసరమైతే రోగులను 108లో చల్లపల్లికి ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తున్నాం. పాడైపోయిన ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్‌ను త్వరలో బాగుచేయిస్తాం.

–కె.వి.పద్మావతి, వైద్యురాలు, పీహెచ్‌సీ, పురిటిగడ్డ

ఆక్సిజన్ ట్యాంకును త్వరలో ప్రారంభిస్తాం

సీహెచ్‌సీలో ఉన్న కొత్త ఆక్సిజన్ ట్యాంకును త్వరలో ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఆసత్రిలో 10 పెద్దవి, ఏడు చిన్న ఆక్సిజన్ సిలీండర్లు అందుబాటులో ఉన్నాయి. ఖాళీ అవగానే వెంటనే వాటి స్థానంలో నిండు సిలిడర్లు తెప్పిస్తున్నాం.

–బి.శ్రీనివాస్, సూపరింటెండెంట్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, చల్లపల్లి

యోగాతో అనారోగ్య సమస్యలు దూరం



యోగాసనాలు చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

మచిలీపట్నంటౌన్: యోగతో మానసిక, శారీరక రుగ్మతలు మాయమవుతాయని నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశపు హాలులో గురువారం యోగ శిక్షణ తరగతులు నిర్వహించారు. వీటిని బాపిరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఉద్యోగులతో పాటు ఉపాధ్యాయులు, నగరంలోని యువతీ యువకులు, డ్వాక్రా మహిళలు, నగర ప్రముఖులు పాల్గొనాలన్నారు. యోగాంధ్ర యాప్‌లో నగరంలోని ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. యోగ మాస్టర్ ముదిగొండ శాస్త్రి మాట్లాడుతూ శనివారం మునిసిపల్ ప్రధాన పార్కులో జరగనున్న యోగ శిక్షణ తరగతుల్లో సచివాలయ ఉద్యోగులతో పాటు నగర ప్రముఖులు పాల్గొంటారన్నారు.

పెడన: యోగాసనాలతో ఆరోగ్యం పదిలంగా ఉంచుకోవచ్చని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ అన్నారు. మాస్టర్ ట్రైనీ, చెన్నూరు హైస్కూలు ఫిజికల్ డైరెక్టర్ భాష్యం మండలంలోని ట్రైనీలకు శిక్షణ తరగతులు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేస్తే నిత్యం చైతన్యవంతులుగా ఉంటారని స్పష్టం చేశారు. యోగా అలవాటు చేసుకుంటే ఆరోగ్యం మంచిగా ఉంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, ఎంఈవో హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు యోగ శిక్షణ

చల్లపల్లి: ట్రైనర్లు యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వి.రవిశంకర్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం చల్లపల్లి పంచాయతీ పరిధిలోని నాలుగు, లక్ష్మీపురంలోని మూడు, మంగళాపురం సచివాలయాల్లోని యోగా ట్రైనర్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువులు రామకృష్ణప్రసాద్, ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా మానిటరింగ్ యోగా గురువులు ఎం.ఎస్.ప్రసన్న, నాగరాజు తదితరులు శిక్షణ ఇచ్చారు.

అన్నీ ఉన్నా జాప్యమేల!



ప్రారంభానికి నోచుకోని మహిళా జిమ్



పిల్లల ఆటస్థలం

మచిలీపట్నంఅర్బన్: స్థానిక మాకర్ల వెంకటస్వామి నాయుడు మునిసిపల్ పార్కులో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మహిళా జిమ్, పిల్లల ఆటస్థలను ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది. డివీస్ లేబొరేటరీస్ సంస్థ సౌజన్యంతో మున్సిపల్ పార్కులో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రత్యేకంగా స్త్రీల కోసం జిమ్, పిల్లలకు ఆటల పరికరాలతో ప్లే గ్రౌండ్ రూ 36 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు.

పూర్తిస్థాయిలో వినియోగంలో ఉన్నా..

రెండు నెలలుగా పరికరాలతో జిమ్, ఆటస్థలం పూర్తి స్థాయిలో వినియోగానికి సిద్ధంగా ఉన్నా, అధికారికంగా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో పరికరాలు నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. పార్కు ప్రాంగణంలో ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని అమర్చేందుకు కొన్ని పరిపాలనా ప్రక్రియలు ఇంకా పూర్తికాలేదన్న నెపంతో అధికారులు జాప్యం చేస్తున్నారని తెలుస్తోంది. ప్రతిరోజూ పార్కుకు వస్తున్న మహిళలు, పిల్లలు ఇవి మూసి కనిపిస్తుండటంతో నిరాశ చెందుతున్నారు. ఆట స్థలంలోని పరికరాలు పిల్లలు వినియోగించుకోలేక నిరుత్సాహ పడుతుండగా, మహిళలు ఆరోగ్యభద్రతకు జిమ్ పరికరాలు ఉపయోగించుకోవడానికి ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పార్కులో జిమ్, ఆట స్థలాన్ని అధికారికంగా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలో జెడ్పీహెచ్‌ఎస్‌లకు కొత్త ప్రధానోపాధ్యాయులు

పెడన: మండల పరిధిలో ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నలుగురు ప్రధానోపాధ్యాయులకు స్థాన చలనం కలిగింది. మరొక పాఠశాలకు కొత్తగా హెచ్ఎం పోస్టు మంజూరు కావడంతో ఆ పోస్టులోకి కూడా కొత్తగా హెచ్ఎం రానున్నారు. ఎంఈవో–2 హరనాథ్ తెలిపిన వివరాల మేరకు కేఎస్ఎస్ఆర్ ఆంజనేయులు మండవల్లి మండలం చింతపాడు జెడ్పీహెచ్ఎస్ నుంచి చెన్నూరు జెడ్పీహెచ్ఎస్‌కు రానున్నారు. చెన్నూరులో ఉన్న హెచ్ఎం సిద్దినేని సౌజన్య పెడన మండలం నందిగామ జెడ్పీహెచ్ఎస్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ పదవీ విరమణతో పోస్టు ఖాళీగా ఉంది. కలిదిండి మండలం పెదలంక జెడ్పీహెచ్ఎస్ నుంచి అనిశెట్టి నాగేశ్వరరావు పెనుమల్లికి రానున్నారు. పెనుమల్లిలో విధులు నిర్వహిస్తున్న విజయకుమారి గూడూరుకు బదిలీ అయ్యారు. కలిదిండి భాస్కరరావుపేట నుంచి కటకం పాండురంగారావు చేవేంద్రకు రానున్నారు. ఇక్కడ కొత్తగా హెచ్ఎం పోస్టు మంజూరైంది. పెడన బీజీకే జెడ్పీహెచ్ఎస్‌కు వత్సవాయి మండలం కంభంపాడు నుంచి లంక ఇందిరా రానున్నారు. ఇక్కడ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జి కొనసాగుతూ వచ్చారు. ఆయా పాఠశాలలకు బదిలీపై రానున్న వారు ఈ నెల 31వ తేదీలోగా రిలీవ్ అయి ఒకటో తేదీన కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంటుందని విద్యాశాఖాధికారులు ఆదేశాలు ఇచ్చారని ఎంఈవో తెలిపారు.

గూడూరులో..

గూడూరు: ప్రభుత్వం చేపట్టిన ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో గూడూరు మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పలువురు ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారు. గూడూరు జెడ్పీ హైస్కూలు హెచ్ఎం డి.పుష్పలత బందరు మండలం పోలాటితిప్పకు బదిలీ అవ్వగా ఆమె స్థానంలో పెడన మండలం పెనుమల్లి హైస్కూలు నుంచి గొరిపర్తి వెంకట విజయకుమారి నియమితులయ్యారు. కప్పలదొడ్డి హైస్కూలు హెచ్ఎం జ్యోతి బందరు మండలం గుండుపాలెంకు బదిలీ అవ్వగా ఆమె స్థానంలో కోడూరు హైస్కూలు హెచ్ఎం సుధారాణి నియమితులయ్యారు. కొత్తగా అప్‌గ్రేడ్ అయిన పోలవరం హైస్కూలుకు ఘంటసాల మండలం కొడాలి హైస్కూలు హెచ్ఎం మురళీకృష్ణ నియమితులయ్యారు. మల్లవోలు హైస్కూలు హెచ్ఎం కె.అరుణ మొవ్వ మండలం నిడుమోలుకు బదిలీ అయ్యారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయండి



మచిలీపట్నంఅర్బన్: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు కోరారు. గురువారం కలెక్టర్ డీకే బాలాజీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్ని శాఖల పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఎమెస్పీ జిల్లా ఇన్‌చార్జి జయరాజు, ఎంఈఎఫ్ జిల్లా సలహాదారు గంద్రపు సీమయ్య, అధ్యక్షులు బొకినాల కృష్ణ, కార్యదర్శి బీడెల్లి మరియకుమార్, లీగల్ సెల్ అధ్యక్షులు అద్దేపల్లి నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సాగులో సాంకేతికతను అందుకోవాలి



మాట్లాడుతున్న ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణాధికారి శివన్నారాయణ

వేకనూరు(అవనిగడ్డ): మండల పరిధిలోని వేకనూరులో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ప్రారంభమైంది. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వేకనూరు వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. సాగులో మెలకువలు నేర్చుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలన్నారు. ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ మాట్లాడుతూ వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. జిల్లా నోడల్ అధికారి, కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి రైతులు, శాస్త్రవేత్తలతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఉయ్యూరు చెరకు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ చెరకు సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆయిల్ పాం పరిశోధనా శాస్త్రవేత్త డాక్టర్ కల్యాణ్‌బాబు, కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి మంజువాణి, శాస్త్రవేత్త డాక్టర్ రేవతి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డ్రోన్ ప్రదర్శనను ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌తో పాటు పలువురు రైతులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుంగల శ్రీలక్ష్మి, ఎంపీడీవో మరియాదేవి, ఏడీఏ జయప్రద తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర సర్వే రిజిస్ట్రేషన్‌లో వేగం పెంచండి

పెడన: గ్రామ సచివాలయాల్లోని సిబ్బందికి అప్పగించిన, నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో అరుణకుమారి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆమె టెలి కాన్ఫరెన్సులో సచివాలయ ఉద్యోగులతో పాటు ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌లపై సమీక్షించారు. గ్రామ సచివాలయాల పరిధిలోని జనాభా ప్రాతిపదికన 40 శాతం మందితో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. సర్వే చేయించడమే కాకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ సర్వే నివేదికలో బాగా వెనుకబడి ఉన్నామని, పూర్తి చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్సులో ఏవో శిరీష, సీనియర్ అసిస్టెంట్ విజయ తదితరులు పాల్గొన్నారు.

ఏసీవో రారు.. మిగిలిన ఉద్యోగులు అంతంత మాత్రమే..!

పెడన మండల వెలుగు కార్యాలయం దుస్థితి



పెడన వెలుగు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే.. మిగిలిన సీట్లు ఖాళీ

పెడన: ఏసీవో రారు.. కార్యాలయంలో మిగిలిన ఉద్యోగులు రావడం అంతంతమాత్రంగా ఉంది. ఇదెక్కడంటే.. వెలుగు పెడన నియోజకవర్గ ఏరియా కో ఆర్డినేట్ అధికారి కార్యాలయంతో పాటు ఏపీఎం కార్యాలయం పెడనలో ఉంది. ఈ కార్యాలయంలో ఏసీవోకు అదనంగా జిల్లా కార్యాలయంలో మరో కీలక పోస్టు బాధ్యతలు ఉండటంతో ఆయన పెడనకు రావడం మానేశారు. అసలు ఆయన పెడనకు, నియోజకవర్గంలో పర్యటనలకు ఎప్పుడు వస్తారో.. వచ్చారో కూడా ఎవరికి తెలియని పరిస్థితి నెలకొంది. ట్రావెలింగ్ అలవెన్సులను పొందడానికి మాత్రమే ఈ పోస్టును అట్టిపెట్టుకున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

ఇష్టానుసారం..

సదరు ఏసీవో పెడన కార్యాలయానికి పూర్తిస్థాయిలో రాకపోవడంతో కింది స్థాయిలో ఉండే అధికారులు ఏపీఎం, అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, సీసీలు ఇష్టానుసారంగా సమయపాలన లేకుండా వస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరు మూమెంట్ రిజిస్టర్‌ను కూడా సరిగ్గా నిర్వహించడం లేదనే వాదనలున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ దుస్థితి ఏర్పడిందని డ్వాక్రా మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాన్ని చక్కదిద్దాలని కోరుతున్నారు.

ఆదర్శమూర్తి మాజీ సర్పంచ్ సీతారావమ్మ



చినతుమ్మిడి మాజీ సర్పంచ్ సీతారావమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రాము

బంటుమిల్లి: ఇంటికి వచ్చిన వారిని పలకరించి అన్నం పెట్టిన ఆదర్శమూర్తి సీతారావమ్మ అని పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. గురువారం మండల పరిధిలోని చినతుమ్మిడిలో మాజీ సర్పంచ్, ఎంపీపీ వెలివెల చినబాబు మాతృమూర్తి సీతారావమ్మ సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో రాము ఆమె సేవలను కొనియాడారు. అంతకు ముందు ఆమె చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం సీతారావమ్మ భర్త డీసీఎంఎస్ మాజీ వైస్‌చైర్మన్ వెలివెల శివానంద్, కుమారులు తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్ ఐజీ సత్యనారాయణ, ఎంపీపీ చినబాబు తదితర కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతి తెలిపారు. రాము వెంట నియోజకవర్గంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు వచ్చారు.

భూసార పరీక్షలతో ఎన్నో ఉపయోగాలు



వెంకటాపురంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్

వెంకటాపురం(మోపిదేవి): భూసార పరీక్షలతో రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞానకేంద్రం ఘంటసాల జి.కృష్ణవేణి అన్నారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పిలుపు మేరకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం వెంకటాపురంలో గ్రామ సర్పంచ్ తుమ్మా సోములమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసార పరీక్షలతె రైతులకు కలిగే ప్రయోజనాలు, లభ్యమయ్యే విత్తనాలను వివరించారు. మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం డాక్టర్ కె. నాగేంద్ర మాట్లాడుతూ వరిలో నూతన వంగడాలు, వివిధ నేలలకు అనువైన వరి రకాలు, వాటిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం డాక్టర్ సుబ్బన్న, మండల ఏవో హెప్సిబారాణి, వెంకటాపురం, పెదకళ్లేపల్లి, శివరామపురం, రావివారిపాలెం, పెదప్రోలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చలో వరంగల్‌ను జయప్రదం చేయండి

మచిలీపట్నంటౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 31న చేపట్టిన చలో వరంగల్ కార్యక్రమానికి మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సిద్దెల జయరాజు మాదిగ కోరారు. గురువారం మచిలీపట్నానికి విచ్చేసిన ఆయన ఎమ్మార్పీస్, ఎంఈఎఫ్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 27న భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు తీసుకున్నారన్నారు. ఆయన ఈనెల 31న వరంగల్‌కు విచ్చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ లీగల్ అడ్వైజర్ నిరంజనరావు, ఎమ్మార్పీఎస్ మచిలీపట్నం అధ్యక్షుడు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూర్‌ఆలీకి సత్కారం

ఘంటసాల: షియా ముస్లింల పవిత్ర యాత్రలో భాగంగా ఇరాన్ దేశంలోని కర్ బలా మైదానాన్ని సందర్శించిన మీర్జా నూర్ అలీ జీవితం ధన్యమైందని జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ అన్నారు. ఘంటసాలలో తాపీ మేస్త్రీగా చేస్తున్న అలీనిఖీపాలెంకు చెందిన మీర్జా నూర్ ఆలీ ఇటీవల కుటుంబ సమేతంగా షియా ముస్లిం పవిత్ర యాత్రలో భాగంగా 22 రోజుల పాటు ఇరాన్ దేశంలో పర్యటించి 72 మంది త్యాగమూర్తుల గుమ్మటం (సమాధి)లను దర్శించుకుని గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మీర్జా నూర్ అలీని యూవీఆర్ గొర్రెపాటి స్కూల్‌లో గురువారం ఘనంగా సన్మానించారు. గొర్రెపాటి ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

450 కేజీల శనగలతో రామలింగేశ్వరుడికి వైభోగం



శ్రీరామపాదక్షేత్రంలో శనగలతో అభిషేకం తర్వాత రామలింగేశ్వరుని అలంకార శోభ

నాగాయలంక: మహాశివుడి జన్మనక్షత్రం(ఆర్ద్ర) పురస్కరించుకుని నాగాయలంక కృష్ణానది తీరంలోని శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద శ్రీరామలింగేశ్వర మండపంలో గురువారం రాత్రి భక్తులు సమర్పించిన 450 కేజీల నానబెట్టిన పచ్చి శనగలతో అత్యంత వైభవంగా అభిషేకించారు. నిర్వాహకులు తొలుత 108 కేజీలతో అభిషేకం, అలంకరణ చేయాలని భావించినా భక్తులు సైతం శనగలు తీసుకొచ్చి స్వామివారికి స్వయంగా అభిషేకించ వచ్చని ఆహ్వానించడంతో అనూహ్యంగా 450కి పైగా కేజీల శనగలను భక్తులు కమిటీకి అందజేశారు. అర్చకుడు అంబా సాయి కిరణ్‌శర్మ బ్రహ్మత్వంలో శనగలతో జరిపిన అభిషేకం, అలంకారంతో భక్తి పారవశ్యంలో శివనామస్మరణ చేశారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహణకర్త తలశిల రఘుశేఖర్, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అభిషేకించిన శనగలన్నింటిని పూజ ముగిసిన తదుపరి మత్స్య సంపదకు ఆహారంగా కృష్ణానదిలోకి పోస్తామని రఘుశేఖర్ చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 75 మంది లబ్ధిదారులకు రూ.36.02 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.

వైద్య ఖర్చులకు సాయం

రావివారిపాలెం(మోపిదేవి): మండలంలోని మోపిదేవిలంకకు చెందిన రాజులపాటి గురున్నాథం కుమారుడు నాగమయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తెలుగు వన్ ఫౌండేషన్ ప్రతినిధి కంఠంనేని శివశంకర్(పెదబాబు) రూ.10వేల చెక్కును గురువారం అందజేశారు.

రేపటి నుంచి బర్రంకులలో ఉరువులమ్మ జాతర

గణపేశ్వరం(నాగాయలంక): మండలంలోని గణపేశ్వరం శివారు బర్రంకుల గ్రామదేవత ఉరువులమ్మ జాతర మహోత్సవం శని, ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతరలో భాగంగా ఈ నెల 31న అమ్మవారిని గ్రామంలో ఊరేగిస్తారు. జూన్ 1 ఆదివారం అమ్మవారు గుడికి చేరుకోవడంతో ఆలయ కమిటీ నేతృత్వంలో జాతర సంప్రదాయాలకు అనుగుణంగా పూజ నిర్వహిస్తారు.